క్లుప్తంగా

నేడు ఓల్డ్ గాయత్రీనగర్‌లో వైద్య శిబిరం

మీర్‌పేట: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం మీర్‌పేట కార్పొరేషన్‌లోని ఓల్డ్ గాయత్రీనగర్ శ్రీ శారదా లక్ష్మీనర్సింహాస్వామి దేవాలయ ఆవరణలో ఓజోన్, నేత్రాలయ హాస్పిటల్స్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ సభ్యుడు వంటేరు నర్సింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులు అందజేస్తారని, అవకాశాన్ని పరిసర ప్రాంతవాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఘనంగా షబ్-ఎ-మెరాజ్ వేడుకలు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల జామ్ మజీద్‌లో షబ్-ఎ-మెరాజ్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మత పెద్దలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు అలీ, బషీర్‌ఖాన్, సయ్యద్, హుస్సేన్, సలీం, హఫీజ్, రెహ్మాన్, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తాం

మాజీ ఎమ్మెల్యే కేఎల్లాఆర్



కందుకూరు: కందుకూరు మండలం పరిధిలో నెలకొల్పనున్న మెడికల్ కళాశాల, ఆస్పత్రి భవనం తప్పకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మిస్తుందని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్లాఆర్) తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇక్కడ మెడికల్ కళాశాల నిర్మించడంలేదని వస్తున్న పుకార్లను నమ్మవద్దన్నారు. తమ ప్రభుత్వం తప్పనిసరిగా మెడికల్ కళాశాలతో పాటు ఆస్పత్రి భవనాన్ని నిర్మిస్తుందని స్పష్టం చేశారు. ఎలాంటి అపోహలకు తావులేదన్నారు. ఆయన వెంట పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి పాల్గొన్నారు.

'కూచిపూడి'లో శాన్విశ్రీకి జాతీయ అవార్డు



బేబి శాన్విశ్రీ

వనస్థలిపురం: ఇండియన్ ఆర్ట్ అండ్ కల్చర్, మినిస్ట్రీ ఆఫ్ కల్చర్‌ల ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన 10వ నేషనల్ డ్యాన్స్ కాంపిటీషన్‌లో కూచిపూడి నాట్యంలో వనస్థలిపురంలోని ఎస్‌కేఎస్ కళాక్షేత్రం డ్యాన్స్ అండ్ మ్యూజిక్ స్కూల్ విద్యార్థి చిన్నారి శాన్విశ్రీ ఉత్తమ ప్రతిభ కనబర్చి 2వ బహుమతి సాధించింది. 2500 మంది పాల్గొన్న ఈ పోటీల్లో శాన్విశ్రీ 2వ బహుమతిని సాధించడంపై నాట్య గురువులు డాక్టర్ మనోజ్ఞ, డా.కృష్ణకుమారి, డా.వేదాంతం రాదేశ్యాం, డా.పసుమర్తి శేషుబాబు ఆనందం వ్యక్తం చేశారు.అక్షర ఇంటర్నేషనల్ స్కూల్‌లో శాన్విశ్రీ 2వ తరగతి చదువుతోందని తల్లిదండ్రులు డా.మనోజ్ఞ, రామకృష్ణ తెలిపారు.

ఏరియా ఆసుపత్రిలో అన్నదానం

వనస్థలిపురం: జ్ఞాన సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి వద్ద రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్దగొని లక్ష్మీప్రసన్న, నాయకులు పోచంపల్లి గిరిధర్, సాయికుమార్ పాల్గొన్నారు.

హద్దులు ఏర్పాటు చేయాలి

ఇబ్రహీంపట్నం రూరల్: కొంగరకలాన్‌లోని కొత్త చెరువును సర్వే చేసి ఎఫ్‌టీఎల్ హద్దురాళ్లను ఏర్పాటు చేయాలని ఓ యువకుడు నిరాహారదీక్షకు దిగాడు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్‌కు చెందిన జనార్దన్ అనే యువకుడు చౌరస్తాలో దీక్షకు పూనుకున్నాడు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించాలని డిమాండ్ చేశాడు. చెరువును కాపాడి పట్టణ ప్రజలకు, మత్స్యకారులకు ఉపాధి కల్పించేలా కృషి చేయాలని కోరారు.

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ

మంచాల: మండల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా మంచాల మండలంలోని చీదేడ్ గ్రామానికి చెందిన రామకృష్ణను నియమించారు. గురువారం రామకృష్ణకు కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రంగారెడ్డికి రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.



చెత్తా చెదారంతో హుడాకాలనీ పార్కు



తుప్పపట్టి పోతున్న చిన్నారుల ఆట పరికరాలు

ఆహ్లాదం ఆమడ దూరం!

- నిర్వహణ లోపంతో కళతప్పిన పార్కులు
- వాకర్స్ సైతం రాని పరిస్థితి
- పట్టించుకోని అధికారులు

హుడాకాంప్లెక్స్: ప్రజలకు ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కులు కళావిహీనంగా మారాయి. నిర్వహణ లోపానికి తోడు కనీసం నీళ్లు కూడా పోసే వారు లేకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. పచ్చిక బయళ్లు, రంగు రంగుల పూలతో కనువిందు చేయాల్సిన పార్కులు.. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. సరూర్‌నగర్ మండలం హుడాపార్కులో చెత్తాచెదారంతో పేరుకుపోయింది. కాలనీల్లోని పార్కుల్లో పచ్చదనం కనుమరుగవుతోంది. పిల్లలు ఆడుకోవడానికి ఏర్పాటు చేసిన పరికరాలు నిర్లక్ష్యంతో తుప్పు పడుతున్నాయి. చెత్తాచెదారం, దుమ్ముధూళితో అందవిహీనంగా తయారవుతున్నాయి. ఇక ఈ వేసవి సెలవుల్లో చిన్నారులు ఇక్కడకు వచ్చి సరదాగా గడిపేందుకు ఎలాంటి అవకాశాలు లేవు. ఈ దయనీయ పరిస్థితికి సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయం సమీపంలో ఉన్న హుడాకాలనీ పార్కు అద్దం పడుతోంది. పార్కు అభివృద్ధి, నిర్వహణ చేపట్టకపోవడంతో నిరుపయోగంగా మారింది. మార్నింగ్ వాకర్స్‌కు కూడా ఉపయోగం లేకుండా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్ల ఆకులను తగులబెట్టడం, ఎప్పటికప్పుడు చెత్తను తరలించడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.

నిరుపయోగంగా..

కాలనీ ఏర్పాటు చేసినప్పుడు సుమారు 1,200 గజాల స్థలాన్ని చిల్డ్రన్స్ పార్కుకు కేటాయించారు. జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రహరీ నిర్మించి పిల్లలు ఆడుకునేందుకు ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. కానీ నిర్వహణ లేకపోవడంతో తుప్పుపట్టాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కును సుందరంగా తీర్చిదిద్దాలని, చిన్నారులకు ఆహ్లాదాన్ని పంచే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఎవరూ రావడం లేదు



చిన్న పిల్లల కోసం ఏర్పాటు చేసిన పార్కులో పచ్చదనం కనిపించడం లేదు. ఆహ్లాదమే లేదు. ఆడుకోవడానికి ఎవరూ రావడం లేదు. పచ్చదనం, ఆహ్లాదం ఉంటేనే పిల్లలు ఆనందంగా ఆడుకోవడానికి వస్తారు. అధికారులు స్పందించి బాగు చేయాలి.

– బి.వేణుకుమార్, చెరుకుతోట కాలనీ

అభివృద్ధికి కృషి చేస్తున్నా..



నిధులు, నిర్వహణ సిబ్బంది లేక పార్కులు బోసిపోతున్నాయి. ఈ అంశాన్ని జీహెచ్‌ఎంసీ పరిధిలోకి తీసుకువస్తే బాగుంటుంది. పచ్చని మొక్కలు పెట్టి ఆహ్లాదాన్ని కల్పించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తా.

– ఆకుల శ్రీవాణి, కార్పొరేటర్

కృష్ణా జలాలపై మాట్లాడే అర్హత బీఆర్‌ఎస్‌కు లేదు

జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండు రంగారెడ్డి

కందుకూరు: కృష్ణా జలాల గురించి మాట్లాడే కనీస నైతిక అర్హతను బీఆర్‌ఎస్ పార్టీ కోల్పోయిందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి విమర్శించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల అధికారంలో ఉండి గోదావరి ప్రాజెక్టుల నిర్మాణంలో కేసీఆర్, హరీశ్‌రావుల అవినీతి బట్టబయలై జైలుకు వెళ్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. దీన్ని పక్క తోవ పట్టించేందుకే కృష్ణా జలాలపై హంగామా సృష్టిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇందులో భాగంగానే మాజీ మంత్రి సబితారెడ్డి కృష్ణా జలాలపై నీటి హక్కులు కేఆర్‌ఎంబీకి కాంగ్రెస్ ప్రభుత్వం అప్పగిస్తూ తెలంగాణకు నష్టం కలిగిస్తున్నారంటూ దుష్ప్రచారాన్ని మొదలు పెట్టారన్నారు. కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా విషయంలో కేంద్ర ప్రభుత్వ వివక్షత, బీఆర్‌ఎస్ నిర్లక్ష్యం తేటతెల్లమైయిందన్నారు. మొత్తం జల వనరులపై కేంద్ర ప్రభుత్వం గుత్తాధిపత్యం కోసం గెజిట్ తెస్తే అప్పట్లో కేసీఆర్ సీఎం హోదాలో ఉండి కూడా మౌనంగా ఉన్నాడని ఆరోపించారు. అటు ఆంధ్రప్రదేశ్, ఇటు మహారాష్ట్రతో వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాలు ఆశించి వారితో చెలిమి చేస్తూ, నీటి వాటాలో తెలంగాణ ప్రయోజనాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం పణంగా పెట్టిందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల దృష్టిని మళ్లించేందుకే బీఆర్‌ఎస్ కృష్ణా జలాలపై హడావిడి చేస్తుందన్నారు. ఐదేళ్ల సర్పంచులను నానా అగచాట్లు పెట్టి అప్పులపాలు చేసి నేడు వారికి వీడ్కోలు సమావేశాలు పెట్టి సానుభూతి చూపడం విడ్డూరంగా ఉందన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



'బస్తీ చలో' కరపత్రాలు పంచుతున్న కార్పొరేటర్ ప్రేమ్, బీజేపీ నాయకులు

చైతన్యపురి: ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు దాసరి జయప్రకాష్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన బస్తీ చలో కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొన్నారు. త్యాగరాజ నగర్ కాలనీలో బూత్ సభ్యులతో స్వచ్ఛ భారత్ నిర్వహించిన అనంతరం పలు కాలనీలో మోదీ పథకాలపై ఇంటింటికి కరపత్రాలు పంచిపెట్టారు. కేంద్ర ప్రభుత్వం పేదల కోసం తీసుకొచ్చిన పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో చలో అభియాన్ కన్వీనర్ ఏనుగు శ్రీధర్‌రెడ్డి, కో-కన్వీనర్ బొమ్మరాజు సందీప్, స్థానిక బీజేపీ నాయకులు ఓంకార్, మధుసూదన్, సుబ్బారెడ్డి, శ్రీనివాస్, ధనరాజ్, వెంకట్‌రెడ్డి, రత్నం, సిరిరెడ్డి, జయ, పద్మజ, శరత్, వినయ్ పాల్గొన్నారు.

సైబర్ మోసాలతో జాగ్రత్త



పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసు సిబ్బంది

సీఐ కాశీ విశ్వనాథ్

మీర్‌పేట: సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మీర్‌పేట సీఐ కాశీ విశ్వనాథ్ విద్యార్థులకు సూచించారు. మీర్‌పేట నారాయణ ఐఐటీ ఒలింపియాడ్ పాఠశాలలో గురువారం సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సెల్‌ఫోన్ ఉపయోగించే విధానం, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, క్రిప్టోకరెన్సీ, మనీ యాప్‌ల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదే విధంగా సోషల్ మీడియా ఖాతాలలో వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ ఇవ్వరాదని తెలిపారు. ఏజీఎం రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ బాబ్జీ, అనీల్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల తుది జాబితా విడుదల



కందుకూరులో రాజకీయ నాయకులతో సమావేశమైన ఆర్డీఓ సూరజ్‌కుమార్ తదితరులు

కందుకూరు: మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఓటర్ల ఫైనల్ లిస్టును ఆర్డీఓ సూరజ్‌కుమార్ విడుదల చేశారు. గురువారం ఆర్డీఓ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమైన అనంతరం పూర్తిస్థాయి ఓటర్ల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో మొత్తం 5,46,577 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ప్రస్తుతం 542 పోలింగ్ బూత్‌ల పరిధిలో 5,55,976 మంది నమోదైనట్లు తెలిపారు. ఇందులో పురుషులు 2,84,913 మంది, మహిళలు 2,70,996, థర్డ్ జెండర్లు 69, సీనియర్ సిటిజన్లు 7,893, వికలాంగులు 8,501, యువ ఓటర్లు(18–19 ఏళ్ల మధ్య) 12,045 మంది ఉన్నట్లు తెలిపారు. ఆ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ శేఖర్, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అందేలా కృషి



ఉచిత విద్యుత్‌కు సంబంధించి వివరాలు అందజేస్తున్న కార్పొరేటర్ మాధవి

మీర్‌పేట: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి చేస్తానని మీర్‌పేట కార్పొరేషన్ 45వ డివిజన్ కార్పొరేటర్ అక్కి మాధవి తెలిపారు. గృహజ్యోతి పథకంలో భాగంగా గురువారం డివిజన్ పరిధిలో 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్‌కు సంబంధించి ఆ శాఖ సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పరిశీలనకు ఇంటికి వచ్చే విద్యుత్ సిబ్బందికి ప్రజాపాలనలో దరఖాస్తు చేసిన రశీదుతో పాటు రేషన్, ఆధార్‌కార్డులను చూపించి మీటర్ సర్వీస్ నంబర్‌కు అనుసంధానం చేసుకోవాలని సూచించారు. సిబ్బంది రానియెడల తన దృష్టికి తీసుకురావాలని అన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత

జెడ్పీటీసీ వెంకటేశ్

తలకొండపల్లి: ఆధ్యాత్మికతతో మానసిన ప్రశాంతత పొందవచ్చని జెడ్పీటీసీ వెంకటేశ్ అన్నారు. గురువారం ఊరుకొండ మండలం ఊరుకొండపేట్ గ్రామంలోని అభయాంజనేయ స్వామి బ్రహోత్సవాల్లో వెంకటేశ్ పాల్గొన్నారు. స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆయనను సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం జెడ్పీటీసీకి మాజీ సర్పంచ్ శ్రీనివాసులు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో భక్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కండి

కడ్తాల్: గ్రామాల అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వామ్యులు కావాలని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని గోవిందాయిపల్లి, పల్లెచెలక తండా గ్రామ పంచాయతీల్లో ఎంపీపీ పర్యటించారు. ఈ మేరకు ఆయా గ్రామ పంచాయతీల్లో మండల పరిషత్ నిధులు రూ.8 లక్షలతో నిర్మించనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కమ్లీమోత్యానాయక్ మాట్లాడుతూ తండాలు, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామాలు దేశానికి పట్టుకొమ్మలని అన్నారు. అనంతరం చరికొండ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు.

క్యారమ్స్ చాంపియన్‌కు సన్మానం



ఆదిత్యను సన్మానిస్తున్న చిలుక ఉపేందర్‌రెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: రామకృష్ణా పురం డివిజన్‌లోని అల్కాపురి భవన్‌లో ఎస్‌ఆర్ మీడియా వర్క్స్ ఆధ్వర్యంలో 12వ జాతీయ స్థాయి ఓపెన్ క్యారమ్ టోర్నమెంట్ నిర్వహించారు. ఇందులో భాగంగా నేషనల్ ఛాంపియన్ కె. శ్రీనివాస్‌తో జరిగిన పోటీలో తెలంగాణ రాష్ట్ర క్యారమ్ చాంపియన్ ఎస్.ఆదిత్య విజయం సాధించారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు ఆదిత్యను అభినందించారు. శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో నాగోల్ సుధాకర్ చారి, భరద్వాజ, రామచంద్రారెడ్డి, రాజగోపాల్, వినయ్, విజయ్, వంగాల శ్రీకాంత్ రెడ్డి, పగిళ్ల పురుషోత్తం, విప్లవ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి సమష్టి కృషి



ఆర్టీసీ సిబ్బందిని సత్కరిస్తున్న ఆర్టీసీ ఈడీ పురుషోత్తం తదితరులు

చైతన్యపురి: సంస్థ అభివృద్ధికి సిబ్బంది అంతా సమష్టిగా కృషి చేయాలని ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఈడీ పురుషోత్తం కోరారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్–2 డిపోలో గురువారం జరిగిన త్రైమాసిక చక్ర పురస్కారాల ప్రదాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి అవార్డుకు ఎంపికైన సిబ్బందిని ఆయన అభినందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రకటించిన మహాలక్ష్మి పథకాన్ని విజయవంతం చేసినందుకు అభినందించారు. అలాగే రానున్న మేడారం జాతరకు బస్‌ల నిర్వహణను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ శ్రీధర్, డిప్యూటీ ఆర్‌ఎం రాజు , పలువురు డిపో మేనేజర్లు, సూపర్‌వైజర్లు, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లపై ఆక్రమణలను తొలగించాలి



ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకున్న ప్రదేశాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్

హస్తినాపురం: ఆక్రమణలను టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రోత్సహించరాదని, ఆక్రమణల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలిగితే వెంటనే వాటిని తొలగించాల్సిన అవసరం ఉందని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. జిల్లా పరిషత్ రోడ్డులో రహదారిని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు, షెడ్డులను వివిధ కాలనీల ప్రతినిధులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుజాతానాయక్ మాట్లాడుతూ, డివిజన్ రోడ్డుపై ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని షెడ్లు వేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని వెంటనే తొలగించాలని అధికారులకు సూచించారు. రోడ్డును ఆక్రమించుకోవడం వల్ల తరుచూ జిల్లా పరిషత్ రోడ్డులో ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా తగిన చర్యలు తీసుకుని ఆక్రమణలను తొలగిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మమత, మల్లేశ్‌గౌడ్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సందిగ్ధంలో 'సహకారం'

- కొత్త చైర్మన్ కోసం కసరత్తు
- త్వరలో ఎన్నిక



మంచాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం

మంచాల: మంచాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గం సందిగ్ధంలో పడింది. 2024 జనవరి 31న సహకారం సంఘం చైర్మన్ పుల్లారెడ్డిని అనర్హుడిగా ప్రకటిస్తూ జిల్లా అధికారులు తొలగించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం వైస్ చైర్మన్‌గా ఉన్న యాదయ్యకు తాత్కాలిక చైర్మన్‌గా బాధ్యతలను అప్పగించారు. మంచాల ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘంలో 13 మంది డైరెక్టర్లు ఉన్నారు. వారిలో పుల్లారెడ్డిని తొలగించడంతో 12 మంది డైరెక్టర్లు ఉన్నారు. తిరిగి ఎన్నికలు నిర్వహించాలంటే మరొకరిని కో-ఆప్షన్ మెంబర్‌గా ఎన్నుకోవాలి. అనంతరం డీసీఓను తిరిగి చైర్మన్ ఎన్నికకు చర్యలు తీసుకోవాలని కోరడం జరుగుతుంది. డీసీఓ షెడ్యూల్ ప్రకారం చైర్మన్ ఎన్నిక ప్రక్రియ తేదీని ఖరారు చేస్తారు.

కాంగ్రెస్‌కే మెజార్టీ

మంచాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పదవి కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోనుంది. మంచాల ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘంలో 12 మంది డైరెక్టర్లలో యాదయ్య, సత్యానారాయణ, రవి, పద్మ బీఆర్‌ఎస్‌కు మద్దతిస్తున్నారు. హన్మంత్‌రెడ్డి, వింజమూరి రాంరెడ్డి, వేణుగోపాల్‌రావు, వెంకటేశ్, రమేశ్, జనార్దన్‌రెడ్డి, మణేమ్మ, అరుణమ్మ కాంగ్రెస్ వైపు ఉన్నారు. దీంతో చైర్మన్ ఎన్నికలో కాంగ్రెస్ గెలిచే అవకాశం ఉంది. అయితే కాంగ్రెస్‌లో కూడా ఇద్దరు ఆశావాహులు చైర్మన్ పదవి కోసం పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే పాలకవర్గం గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. త్వరలోనే జిల్లా అధికారులను కలిసి మంచాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన చైర్మన్ ఎన్నికతో పాటు రైతుల సంక్షేమానికి నిధులు కూడా కేటాయించాలని కోరనున్నట్లు సమాచారం.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

ప్రత్యేకాధికారి సంతోష్



యాచారం: పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి తదితరులు

తలకొండపల్లి: పరిసరాల పరిశుభ్రత చాలా ముఖ్యమని ప్రత్యేకాధికారి సంతోష్ అన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గురువారం మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి, వీరన్నపల్లి, కోరింతకుంటతండా గ్రామ పంచాయతీల్లో ఆయన పర్యటించి పారిశుద్ధ్యం తదితర సమస్యలను తెలుసుకున్నారు. మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. వాటర్ లీకేజీలను అరికట్టి తాగునీటి సమస్య పరిష్కరించున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాసురెడ్డి, వెంకటయ్య, కార్యదర్శులు పరమేశ్వర్, జంగయ్య, వాసావాచారి, గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్

యాచారం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం ప్రత్యేకాధికారులు పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బందితో గ్రామాల్లోని పలు కాలనీల్లో రోడ్లను శుభ్రం చేశారు. పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించారు. చౌదర్‌పల్లి గ్రామంలో ఎంపీడీఓ విజయలక్ష్మి స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పారిశుద్ధ్య పనులపై పంచాయతీ సిబ్బంది సూచనలు చేశారు.